క్లుప్తంగా

ఎల్‌వోసీ అందజేత



ఎల్‌వోసీ అందిస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాల: జిల్లా కేంద్రంలోని 44వ వార్డుకు చెందిన వెంకటేశ్ క్యాన్సర్‌తో బాధపడుతుండగా వైస్ చైర్మన్ గోలి శ్రీనివాస్ ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లగా, నిమ్స్‌లో శస్త్ర చికిత్సల నిమిత్తం రూ.7.50 లక్షల విలువ గల ఎల్‌వోసీని వెంకటేశ్ కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

పిల్లలకు నాణ్యమైన ఆహారం అందించాలి



అంగన్‌వాడీ కేంద్రంలో పరిశీలిస్తున్న ఆర్డీవో

కోరుట్లరూరల్: అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు నాణ్యమైన ఆహారం అందించాలని ఆర్డీవో జీవాకర్ రెడ్డి అన్నారు. మండలంలోని పైడిమడుగులో అంగన్‌వాడీ కేంద్రాలను తహసీల్దార్ కిషన్‌తో కలిసి శనివారం పరిశీలించారు. అనంతరం ప్రభుత్వం పంపిణీ చేసిన భూములు, ధాన్యం కొనుగోలు కేంద్రాలు, ప్రత్యేక ఓటరు నమోదు కేంద్రాలను పరిశీలించి సిబ్బందికి సూచనలిచ్చారు. కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ వై. రాజేందర్ రావు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

అగ్నిమాపక కేంద్రం సందర్శన



మెట్‌పల్లి ఫైర్ స్టేషన్‌లో విద్యార్థినులు

కోరుట్ల: పట్టణంలోని శ్రీ సరస్వతీ శిశుమందిర్ విద్యార్థులు ఫీల్డ్ ట్రిప్‌లో భాగంగా శనివారం మెట్‌పల్లిలోని అగ్నిమాపక కేంద్రాన్ని సందర్శించారు.అగ్నిమాపక కేంద్ర కార్యాలయంలో అగ్నిమాపక వాహనాన్ని, మంటలార్పేందుకు వినియోగించే పరికరాలను పరిశీలించారు.అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలను అధికారులు ప్రాక్టికల్‌గా చేసి చూపించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జగన్, మహేశ్, హెచ్‌ఎం గోపు వెంకటేశ్ పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లో నిలువు దోపిడీ



మాట్లాడుతున్న రమేశ్

జగిత్యాల: రైతులను నిలువుదోపిడీ చేస్తున్నారని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రమేశ్ అన్నారు. శనివారం మాట్లాడుతూ జిల్లాలోని చెలివెల సారంగాపూర్, జగిత్యాల మార్కెట్ యార్డులను సందర్శించామని, ధాన్యం కొనుగోళ్లలో భారీ మోసాలు జరుగుతున్నాయని ఆరోపించారు. మద్దతు ధర కంటే అతితక్కువ ధరలకు కొనుగోలు చేస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా రైతులకు ఇబ్బందులు లేకుండా కొనుగోలు చేయాలన్నారు.సమావేశంలో రైతు సంఘం నాయకులు చంద్రయ్య, మహిపాల్ పాల్గొన్నారు.

ధర్మపురిలో నేడు కోటి లలిత జప యజ్ఞం

ధర్మపురి: పట్టణంలోని బ్రాహ్మణ సంఘ భవనంలో ఆదివారం కోటి లలిత జప యజ్ఞం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఆర్యవైశ్యులు తెలిపారు. మండల ఆర్యవైశ్యులు, లలిత భక్తులచే విశ్వనాథం గురుపీఠం ఆధ్వర్యంలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12-30 వరకు లలితా పారాయణము, హోమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

డ్రైయినేజీలో దిగబడిన లారీ



రోడ్డు పక్క దిగబడిన లారీ

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలం వెల్లులలో లోడ్‌తో వెళ్తున్న ఓ లారీ డ్రైయినేజీలో దిగబడింది. గ్రామంలోని ప్రధాన రహదారి గుండా మెట్‌పల్లి వైపు వెళ్తుండా లారీ వేరే వాహనాలకు సైడ్ ఇచ్చే క్రమంలో ఈ ఘటన జరిగింది. రహదారి ఇరుకుగా ఉండడంతో రాకపోకలకు అంతరాయం కలిగింది.

ఓవర్ లోడ్ సమస్యకు చెక్

- మండలంలో కొత్తగా రెండు విద్యుత్ సబ్‌స్టేషన్లు
- పోసానిపేట, సిరికొండలో ఏర్పాటుకు నిర్ణయం
- వినియోగ దారులకు నాణ్యమైన విద్యుత్



కథలాపూర్: వినియోగదారులకు నాణ్యమైన, అంతరాయం లేకుండా విద్యుత్‌ను అందించేందుకు ట్రాన్స్‌కో అధికారులు ప్రణాళిక ప్రకారం ముందుకెళ్తున్నారు. కథలాపూర్ మండలకేంద్రంలోని 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో ఐదు గ్రామాలుండటం.. ఓవర్ లోడ్‌తో ఏమైనా సమస్యలు వస్తే పనుల్లో జాప్యం జరిగేది. ఓవర్ లోడ్ సమస్యను అధిగమించేందుకు కొత్తగా రెండు విద్యుత్ సబ్‌స్టేషన్లు ఏర్పాటు చేయడమే మార్గమని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు విన్నవించగా.. అవి మంజూరు కావడం విశేషం.

మండలంలో సిరికొండ, పోసానిపేట గ్రామాల్లో విద్యుత్ సబ్‌స్టేషన్లు

కథలాపూర్ మండలంలో 19 గ్రామాలుండగా... 7 విద్యుత్ సబ్‌స్టేషన్లతో విద్యుత్ సరఫరా చేస్తున్నారు. మండలకేంద్రంలో 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో ఐదు గ్రామాలుండటం... గృహాల విద్యుత్ కనెక్షన్లు 4,630 ఉన్నాయి. వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు 2,841 ఉన్నాయి. యాసంగిలో పంట పొలాలకు నీరు ఎక్కువగా ఉన్న సమయంలో విద్యుత్ మోటార్ల వినియోగం పెరుగుతోంది. అటువంటి సమయంలో విద్యుత్ సమస్యలు రావడంతో అధికారులు, రైతులు ఇబ్బందిపడుతున్నారు. ఈ సమస్యను అధిగమించాలంటే కొత్త సబ్‌స్టేషన్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. దీంతో కొత్త సబ్‌స్టేషన్లు ఏర్పాటు చేయడం వల్ల సిరికొండ గ్రామం పరిధిలోని 2,361 కనెక్షన్లు, పోసానిపేట పరిధిలోని 926 విద్యుత్ కనెక్షన్ల భారం కథలాపూర్ సబ్‌స్టేషన్ నుంచి తగ్గనున్నాయి. కొత్త సబ్‌స్టేషన్లు మంజూరు పట్ల ఆయా గ్రామాల రైతులు, ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. పనులు త్వరగా చేపట్టాలని కోరుతున్నారు.

స్థల సేకరణ, టెండర్ ప్రక్రియ చేపడుతాం



కథలాపూర్ మండలంలో పోసానిపేట, సిరికొండ గ్రామాల్లో కొత్తగా 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్లు మంజూరయ్యాయి. పోసానిపేటలో స్థల సేకరణ పూర్తయి టెండర్ ప్రక్రియ చేపడుతున్నాం. సిరికొండలో స్థల సేకరణ విషయంలో కసరత్తు చేస్తున్నాం. ఆ తర్వాత టెండర్ పూర్తి చేసి పనులు ప్రారంభిస్తాం.

– రఘుపతి, ట్రాన్స్‌కో ఏడీఈ, కోరుట్ల రూరల్



మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలంలోని వెల్లుల,పెద్దాపూర్ శివారులోని కాకతీయ కాలువలపై రక్షణ గోడలు దెబ్బతిని ప్రమాదకరంగా మారాయి. దీంతో ఆయా మార్గాల గుండా వెళ్లే వాహనదారులు జంకుతున్నారు. రక్షణ గోడల వద్ద కనీసం హెచ్చరిక బోర్డులు సైతం ఏర్పాటు చేయలేదు. గతంలో వెల్లుల కాకతీయ కాల్వ వద్ద ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. అయినప్పటికీ రక్షణ గోడల ఏర్పాటు విషయంలో అధికారులు నిర్లక్ష్యం వహించడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
నారాయణ రెడ్డి, ఈఈ, ఎస్సారెస్పీ, సెల్ నం : 9701379634

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9705346639, 9440061630, 9705346643

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి



రికార్డులు పరిశీలిస్తున్న ఆర్డీవో శ్రీనివాస్

ఇబ్రహీంపట్నం: ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని ఆర్డీవో శ్రీనివాస్ తెలిపారు. మండలంలోని అమ్మక్కపేట, ఇబ్రహీంపట్నంలో శనివారం కొనుగోలు కేంద్రాలు, బీఎల్‌వోలు చేపడుతున్న కొత్త ఓటర్ నమోదు ఆయన పరిశీలించి మాట్లాడారు. కొనుగోలు కేంద్రాలలో ట్రక్‌షిట్ డేటా ఎంట్రీలు వెంటనే చేపట్టి రైతులకు తొందరగా డబ్బులు ఇప్పించేలా చర్యలు తీసుకోవాలని కొనుగోలు కేంద్రాల సిబ్బందికి సూచించారు. రైతులకు ఇబ్బంది కలగకుండా చర్యలు చేపట్టాలని అన్నారు. బీఎల్‌వోలు 18 ఏళ్లు నిండిన యవతను కొత్తగా ఓటర్‌గా నమోదు చేయాలని సూచించారు. అమ్మక్కపేట ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి, విద్యార్థులకు రుచికరమైన భోజనాన్ని అందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ప్రసాద్, కొనుగోలు కేంద్రాల సిబ్బంది, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు

సారంగాపూర్: ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు తహసీల్దార్ జమీర్ అన్నారు. శనివారం మండలంలోని పలు గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాలను పరిశీలించి, కేంద్రాల నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. ఆయా గ్రామాల్లో కేంద్రాలను ఎంపీడీవో గంగాధర్, ఏవో ప్రదీప్‌రెడ్డి, ఆర్ఐ భాస్కర్‌రావు, డెప్యూటి తహసీల్దార్ లాస్య, ఏపీఎం రాజయ్య పరిశీలించారు.

మార్కెట్ కమిటీ పాలకవర్గానికి సన్మానం



పాలవర్గ సభ్యులను సన్మానిస్తున్న ప్రభుత్వ విప్

కథలాపూర్: కథలాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గ సభ్యులను శనివారం వేములవాడలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సన్మానించారు. రైతులకు ఉన్నత సేవలందించాలని చైర్మన్ నారాయణరెడ్డి, డైరెక్టర్లకు సూచించారు. తమకు పదవులు ఇచ్చినందుకు చైర్మన్‌తోపాటు డైరెక్టర్లు ప్రభుత్వ విప్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు కాయితి నాగరాజు, నాయకులు పులి హరిప్రసాద్, ఎం.డీ అజీమ్, వంగ మహేశ్, గడ్డం లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా



ఓటరు అవగాహన సదస్సులో శేఖర్‌రావు

ధర్మపురి: ధర్మపురి పుణ్యక్షేత్రంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని ట్రస్మా నాయకుడు యాదగిరి శేఖర్‌రావు అన్నారు. ధర్మపురిలోని ఏసీసీ స్కూల్‌లో శనివారం ఏర్పాటు చేసిన పట్టభద్రుల ఓటరు అవగాహన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. వచ్చే ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎమ్మెల్సీగా పోటీ చేస్తానని తెలిపారు. ధర్మపురిలో ప్రతీ ఏడాది గోదావరి వరదలతో తీర ప్రాంత వాసులు తీవ్రంగా నష్టపోతున్నారని ఎమ్మెల్సీగా గెలిచాక ఈ సమస్య పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.ధర్మపురిలో డిగ్రీ కళాశాల ఏర్పాటు, రోళ్లవాగుకు రోడ్డు నిర్మాణం, గోదావరిలో మురుగునీటితో కలుషితమౌతున్న నీటిని ఫిల్టర్ చేసే దిశలో కృషి చేస్తానని అన్నారు.కార్యక్రమంలో ట్రస్మా గౌరవ అధ్యక్షుడు ఎస్ రామకిష్టయ్య, జిల్లా ట్రస్మా గౌరవ అధ్యక్షుడు ఎస్ దినేష్, మండల అధ్యక్షుడు జాజాల రవీందర్, కార్యదర్శి గడ్డం వేణుగోపాల్, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో స్నేహసంబంధాలు మెరుగు



వాలీబాల్ పోటీలు ప్రారంభిస్తున్న భోగ శ్రావణి

రాయికల్: క్రీడలతో స్నేహసంబంధాలు పెంపొందుతాయని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు భోగ శ్రావణి అన్నారు. మండలంలోని అల్లీపూర్‌లో ఉమ్మడి జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రీడలతో యువకుల మధ్య స్నేహసంబంధాలు పెంపొందుతాయన్నారు. కార్యక్రమంలో టోర్నమెంట్ ఆర్గనైజర్ తిరుపతిరెడ్డి, మాజీ సర్పంచ్ అత్తినేని గంగారెడ్డి, వాలీబాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు సంజీవ్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

దుకాణాల్లో మున్సిపల్ సిబ్బంది తనిఖీ

మెట్‌పల్లి: పట్టణంలోని పలు దుకాణాల్లో శనివారం మున్సిపల్ సిబ్బంది తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా నిషేధిత ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తున్న వ్యాపారులకు జరిమానా విధించారు. ప్లాస్టిక్ కవర్లకు బదులు జ్యూట్ సంచులు వినియోగించాలని సూచించారు. మరోసారి పట్టుబడితే రూ.25వేల వరకు జరిమానా విధిస్తామని హెచ్చరించారు. తనిఖీల్లో ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ రత్నాకర్, హెల్త్ అసిస్టెంట్ ప్రవీణ్, విష్ణు, ముజీబ్ తదితరులున్నారు.

సంక్షిప్త వార్తలు

బీసీ సమరభేరి సభకు తరలిరండి

జగిత్యాల: హైదరాబాద్‌లో ఈనెల 25న సోమవారం జరగనున్న బీసీల సమరభేరి సభకు తరలిరావాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీనారాయణ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీలకు రిజర్వేషన్లు పెంచి కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధి నిరూపించుకోవాలన్నారు.చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాంచంద్రం, వంశీ, రోజా, నరేశ్‌కుమార్ పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయానికి విరాళం

కోరుట్ల: పట్టణంలోని అయ్యప్ప గుట్టపై ఉన్న అయ్యప్ప ఆలయానికి మాస్టో విద్యా సంస్థల అధినేత ఆకుల రాజేష్ స్వామి-మంజులా దంపతులు శనివారం రూ.21 వేల విరాళం అందించారు. కార్యక్రమంలో ఆలయ శాశ్వత గౌరవ అధ్యక్షుడు చిదురాల నారాయణ స్వామి, అధ్యక్షుడు అంబటి శ్రీనివాస్ స్వామి, గురుస్వాములు పాల్గొన్నారు.

ఎనిమల్ కేంద్రానికి కుక్కలు తరలింపు

కోరుట్ల: పట్టణంలోని 31 వార్డులో కుక్కలను శనివారం జగిత్యాలలోని ఎనిమల్ కేంద్రానికి తరలించారు. కొన్ని రోజులుగా వార్డుల్లో కుక్కల బెడద తీవ్రంగా ఉండటంతో వార్డు ప్రజలు భయాందోళనతో కమిషనర్ బట్టు తిరుపతికి ఫిర్యాదు చేశారు. కమిషనర్ చొరవతో స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో కుక్కలను జగిత్యాల ఎనిమల్ సెంటర్‌కు తరలించారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ పెండెం గణేశ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ అశోక్, రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

జగిత్యాలరూరల్/మల్యాల: డిసెంబర్ 1న హైదరాబాద్‌లో నిర్వహించే మాల సింహగర్జనకు సంబంధించిన పోస్టర్‌ను శనివారం జగిత్యాల అర్బన్ మండలం తిప్పన్నపేట అంబేద్కర్ చౌరస్తాలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు చిత్తారి ప్రభాకర్ నాయకులు లక్ష్మీనర్సయ్య, వెంకటేశ్, గంగన్న, నారాయణ, తిరుపతి, పాల్గొన్నారు. మల్యాల మండల కేంద్రంలోని బ్లాక్ చౌరస్తాలో శనివారం మాలల సింహగర్జన పోస్టర్‌ను మాల సంఘం నాయకులు ఆవిష్కరించారు.

ప్రాథమిక పాఠశాలల్లో నో బ్యాగ్ డే

మల్లాపూర్: మండలంలోని సాతారం, రేగుంట గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలల్లో శనివారం నో బ్యాగ్ డే, ఫుడ్ ఫెస్టివల్ డే వేడుకలను ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా నిర్వహించుకున్నారు. ఉదయం నుంచి విద్యార్థులు తీసుకువచ్చిన వివిధ రకాల వంటకాలను ప్రదర్శించారు. కార్యక్రమాల్లో హెచ్‌ఎంలు వేముల శ్రీనివాస్, అంబటి భూమేశ్వర్, శంకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నిరుపేద వైద్య ఖర్చులకు ఆర్థికసాయం

మల్యాల: మండలంలోని గొల్లపల్లి గ్రామానికి చెందిన నిరుపేద యువకుడు సుమన్ అనారోగ్యంతో బాధపడుతుండగా, వైద్య ఖర్చుల కోసం రామన్నపేట ఎన్‌ఆర్‌బిఎస్ హ్యూమన్ హెల్పింగ్ ఫౌండేషన్ సభ్యులు శనివారం రూ.20 వేలు ఆర్థిక సాయం అందజేశారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

జగిత్యాలఅగ్రికల్చర్: జిల్లా కేంద్రంలోని జగిత్యాల -2 సెక్షన్ పరిధిలో పాత బస్టాండ్, విద్యానగర్, ఎస్‌కేఎన్‌ఆర్ డిగ్రీ కళాశాల రోడ్డు, రాజీవ్ చౌక్, ధర్మపురి బైపాస్ రోడ్డు, గాయత్రి దేవాలయం ఏరియా, గొల్లపల్లి రోడ్, తాతమ్మ గుడి, విజయపురి, దయాల్‌నగర్, బైపాస్ రోడ్డు, సీతారాం నగర్ కాలనీ ప్రాంతాలకు ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో డీఈ ఎ. రాజిరెడ్డి తెలిపారు. తాటిపల్లి సబ్ స్టేషన్ పరిధిలో..

జగిత్యాల రూరల్ మండలం తాటిపల్లి సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాలకు ఆదివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు డీఈ రాజిరెడ్డి తెలిపారు.

చైన్ స్నాచింగ్‌ల పట్ల అప్రమత్తంగా ఉండాలి

మెట్‌పల్లి: చైన్‌స్నాచింగ్‌ల పట్ల మహిళలు అప్రమత్తంగా ఉండాలని సీఐ నిరంజన్‌రెడ్డి సూచించారు. సర్కిల్ కార్యాలయంలో శనివారం మాట్లాడారు. మహిళలు ఒంటరిగా బయటకు వెళ్లే సమయంలో విలువైన నగలు ధరించవద్దని, ఒకవేళ ధరించాల్సి వస్తే అవి కనబడేలా ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. చుట్టూ ఉన్న వారిని, ముఖ్యంగా ద్విచక్ర వాహనాలపై వెళ్తున్న వారి కదలికలను గమనిస్తూ ఉండాలన్నారు. అనుమానస్పదంగా కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారమందించాలన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు

మేడిపల్లి: మండలంలోని కట్లకుంట గ్రామంలో ఆర్టీసీ బస్సు- బైక్ ఢీకొన్న ఘటనలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు.. జగిత్యాల రూరల్ మండలం చల్‌గల్ గ్రామానికి చెందిన శివరాత్రి రాజు శనివారం పనుల నిమిత్తం బైక్‌పై తొంబరావుపేట వెళ్లి వస్తున్న క్రమంలో కట్లకుంట మూలమలుపు బైక్, బస్సు ఢీకొన్నాయి. రాజుకు తీవ్రగాయాలు కాగా స్థానికంగా ప్రథమ చికిత్స చేసి, మెరుగైన వైద్యం కోసం జగిత్యాల ఆసుపత్రికి తరలించారు.

ఐకేపీ కార్యక్రమాలు వేగవంతం చేయాలి

జగిత్యాలరూరల్: ఐకేపీ కార్యక్రమాలు వేగవంతం చేయాలని జిల్లా ఫైనాన్స్ డీపీఎం విజయభారతి అన్నారు. శనివారం మండల ఐకేపీ కార్యాలయంలో సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో బ్యాంక్ లింకేజీ, మహిళా శక్తి కార్యక్రమాలు, ఎంటర్‌ప్రైజెస్, లోకోస్ యాప్ ఎంట్రీ అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఏపీఎం గంగాధర్, సీసీలు గంగారాం, మరియ, రవీందర్, విద్యాసాగర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

జయప్రదం చేయాలి

కోరుట్ల: కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 26న చేపట్టే కార్యక్రమాలను జయప్రదం చేయాలని జాయింట్ ప్లాట్‌ఫామ్ ఆఫ్ ట్రేడ్ యూనియన్స్, సంయుక్త కిసాన్ మోర్చా నాయకులు పిలుపునిచ్చారు. పట్టణంలోని సీ.ప్రభాకర్ భవన్‌లో జిల్లా నేతలు శనివారం సమావేశం నిర్వహించారు. 8 గంటల నుంచి 12 గంటల పని విధానాన్ని పరోక్షంగా లేబర్ కోడ్‌లను అందుబాటులోకి తెచ్చిందన్నారు. కార్యక్రమంలో వామపక్షాల నాయకులు చెన్నా విశ్వనాథం, సుతారి రాములు, తిరుపతి నాయక్, చింతా భూమేశ్వర్, ఎండీ మౌలాన, సమీర్, శంకర్,రాంబాబు,తదితరులు పాల్గొన్నారు.

కరాటే అసోసియేషన్ నూతన కార్యవర్గం

కోరుట్ల: తెలంగాణ స్పోర్ట్స్ కరాటే అసోసియేషన్ జగిత్యాల జిల్లా నూతన కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మరిపెల్లి లింగయ్య, ఉపాధ్యక్షులుగా పల్లెపు మెగిలి, అబ్బర్ మొయిస్, సామల ప్రవీణ్ కుమార్ సలహాదారులుగా అరుమల రమేశ్, గమ్మల హరీశ్,నవీన్,వికాస్ రావు, నరేశ్‌లు ఎన్నికయ్యారు. ఎన్నికల పరిశీలకునిగా బల్లి ఐలయ్య పాల్గొన్నారు. నూతన కార్యవర్గాన్ని సభ్యులు అభినందించారు.

ఆత్మరక్షణకు కరాటే అవసరం

ఇబ్రహీంపట్నం: ఆత్మరక్షణ కోసం విద్యార్థినులకు కరాటే అవసరమని వర్షకొండ జెడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎం రాజేందర్ అన్నారు. రాణి లక్ష్మీభాయి ఆత్మరక్షణ ప్రతిక్ష కార్యక్రమంలో భాగంగా వర్షకొండ హైస్కూల్‌లో విద్యార్థినులకు కరాటే విద్యను ప్రారంభించారు. విద్యార్థినులకు కరాటే శిక్షకుడు అవినాష్ 3 నెలల పాటు శిక్షణను ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మమత, మధురి, శ్రీనివాస్‌రావు, పాల్గొన్నారు.

ఓటరు నమోదును సద్వినియోగం చేసుకోవాలి

మల్యాల: ఓటరు నమోదు కోసం నిర్వహిస్తున్న స్పెషల్ డ్రైవ్‌ను యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలని మండల తహసీల్దార్ మునీందర్ అన్నారు. మండలంలోని పలు ఓటరు నమోదు కేంద్రాలను శనివారం తహసీల్దార్ సందర్శించారు. బూత్ లెవల్ అధికారులు గ్రామ పంచాయతీల్లో కౌంటర్లు ఏర్పాటు చేసి, 18 ఏళ్లు నిండిన యువతీ, యువకుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. 2025 జనవరి 25 నాటికి 18 ఏళ్లు నిండే యువత ఓటరుగా నమోదు చేసుకోవాలని తహసీల్దార్ సూచించారు. కార్యక్రమంలో తిరుపతి, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

సంఘ భవనానికి స్థలం కేటాయించాలని వినతి

కోరుట్ల రూరల్: మండలంలోని అయిలాపూర్‌లో ఆరె కటిక సంఘ భవనానికి స్థలం కేటాయించాలని సంఘ నాయకులు తహసీల్దార్ కిషన్‌కు శనివారం వినతిపత్రం సమర్పించారు. తమ సంఘంలో 60 మంది సభ్యులం ఉన్నామని, స్థలం కోసం ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్‌ను కోరగా సానుకూలంగా స్పందించారని, తహసీల్దార్‌కు వినతిపత్రం ఇవ్వాలని సూచించినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు గొడికె రాజ్ కుమార్, సురేష్, ప్రవీణ్, రాజ్ కుమార్, అనిల్, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సబ్‌స్టేషన్ కోసం స్థల పరిశీలన

కథలాపూర్: మండలంలోని సిరికొండ గ్రామంలో కొత్తగా 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ మంజూరు కాగా.. దీని కోసం ట్రాన్స్‌కో అధికారులు శనివారం స్థలాన్ని పరిశీలించారు. గ్రామశివారులో సబ్‌స్టేషన్ కోసం స్థలం ఇచ్చేందుకు గ్రామస్తులు నిర్ణయించారు. ట్రాన్స్‌కో అధికారులు పరిశీలించి కొలతలు వేయించారు. నివేదికను ఉన్నతాధికారులకు పంపిస్తామన్నారు. కార్యక్రమంలో ట్రాన్స్‌కో డీఈ రాజబ్రహ్మాచారి, ఏడీఈ రఘుపతి, ఏఈలు మునీందర్‌రెడ్డి, దివాకర్‌రావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సత్యసాయిబాబా జయంతి వేడుకలు



పూజల్లో పాల్గొన్న భక్తులు

జగిత్యాల: జిల్లా కేంద్రంలోని భగవాన్ సత్యసాయి మందిరంలో భక్తులు సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా జిడ్డి నారాయణ పాల్గొన్నారు.

కోరుట్ల: పట్టణంలో శ్రీ సత్యసాయిబాబా జయంతి వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు, భజనలు, భక్తులకు అన్నదానం చేశారు. పూజా మందిరాన్ని కాంగ్రెస్ కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు ప్రారంభించారు. కార్యక్రమంలో జువ్వాడి కృష్ణారావు, ట్రస్ట్ ఫౌండర్ చైర్మన్ వేముల మాణిక్యం-లక్ష్మీబాయి, పూజా మందిర నిర్మాణ దాత చింత అశోక్-రూప, ట్రస్టీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

రాయికల్: శనివారం సత్యసాయి భజన మండలి ఆధ్వర్యంలో నగర సంకీర్తన, భజన వంటి కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో కన్వీనర్ గాజంగి అశోక్, సభ్యులు గంగరాజం,సత్యనారాయణ పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల సంబురాలు



ధర్మపురిలో స్వీట్లు పంపిణీ చేస్తున్న నాయకులు

ధర్మపురి/మల్యాల/కథలాపూర్: మహారాష్ట్రలో జరిగిన ఎన్నికల్లో బీజేపీ కూటమి ఘన విజయం సాధించడంపై నాయకులు నంది కూడలి వద్ద, మల్యాల, కథలాపూర్‌లో శనివారం సంబరాలు జరుపుకున్నారు. బీజేపీ పట్టణశాఖ ఆధ్వర్యంలో టపాసులు పేల్చి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పట్టణశాఖ అధ్యక్షుడు బెజ్జారపు లవన్‌కుమార్, నాయకులు గాజు భాస్కర్ బింగి వేణు, బొబ్బిలి వెంకటస్వామి యాదవ్, బీజేపీ నాయకులు వెంకటేశ్వర్ రావు, బద్రి సత్యం, మల్యాల మారుతి,తదితరులు పాల్గొన్నారు.